జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 5 | మే | 2026 ◆ పేజీలు : 5




# ప్రజావాణిలో వినతులపై తక్షణ చర్యలు

- అదనపు కలెక్టర్ వేణు గోపాల్ ఆదేశాలు



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 4,(ప్రజా జ్యోతి)** కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేణు గోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, గృహ నిర్మాణ శాఖ పిడి రవీంద్రనాథ్ తో కలసి ప్రజల నుండి వచ్చిన వినతిపత్రాలు, ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి హాజరైన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రతి వినతిపత్రాన్ని పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో

మిగతా 2 లో...



# అకాల వర్షాలపై... అప్రమత్తంగా ఉండాలి

- రైతులకు నష్టం లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలి
- మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి
- ప్రతి రైతుకు న్యాయం జరిగేలా కలెక్టర్లు కృషి చేయాలి
- పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రులు

**కొత్తగూడెం కలెక్టరేట్, మే4 ,(ప్రజాజ్యోతి)** రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియపై హైదరాబాద్ నుండి పలువురు మంత్రులు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమాభివృద్ధి, క్రీడలు , యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకాటి శ్రీహరి, ఐటీ, పరిశ్రమలు & వాణిజ్యంశాఖల మంత్రి శ్రీధర్ బాబు, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ, వృద్ధుల సంక్షేమ, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖల మంత్రి అట్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాల ప్రభావంతో ధాన్యం తడిచే పరిస్థితులు ఏర్పడుతున్నందున రైతులు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని సూచించారు. వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, వర్ష సూచనలు ఉన్నప్పుడల్లా వెంటనే రైతులకు సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామ స్థాయి వరకు వ్యవసాయ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండి రైతులను ముందుగానే హెచ్చరించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన అన్ని సదుపాయాలు

మిగతా 2 లో...

# పేదలకు తోడుగా సీఆర్పీఎఫ్

- సీఆర్పీఎఫ్ సివిక్ యాక్షన్ కార్యక్రమం
- గ్రామస్తులకు అవసరమైన సామగ్రి పంపిణీ



**చర్ల, మే 04:(ప్రజా జ్యోతి ):** చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గల గొర్గుండ గ్రామంలో సి.ఆర్.పి.ఎఫ్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేద ప్రజలకు విస్తృతంగా అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. ఛత్తీస్‌గఢ్ సెక్టార్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ షాలిన్, కొంటా రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ రాజేష్‌పాండే, 218 బెటాలియన్ కమాండెంట్ శ్రీ మహమ్మద్ ఖలీద్ ఖాన్ ల సమర్థవంతమైన

మిగతా 2 లో...

# ధర్నాచౌక్ అభివృద్ధికి శ్రీకారం




ప్రజాజ్యోతి ఎఫెక్ట్

- గ్రావెల్‌తో స్థలం లెవల్... శుభ్రత పనులు పూర్తి
- ప్రజాజ్యోతి కథనంతో కదిలిన యంత్రాంగం




**కొత్తగూడెం, మే 4 (ప్రజాజ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమీకృత కార్యాలయం సమీపంలోని ధర్నా చౌక్ దుస్థితిపై ప్రజాజ్యోతి దినపత్రికలో వెలువడిన కథనం ప్రభావంతో అధికారులు స్పందించారు. సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రదేశాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ధర్నా చౌక్ ప్రాంతాన్ని శుభ్రపరిచి, గ్రావెల్‌తో

మిగతా 2 లో...

## అగ్నికి ఆహుతైన అన్నదాత ఆశలు

- కౌలు రైతులు ఆదుకోవాలి
- అఖిలభారత రైతుకూలీ సంఘం నాయకులు డిమాండ్



**టేకులపల్లి,మే04, ప్రజాజ్యోతి:** ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతి కొచ్చే సమయానికి అగ్నిపాలవడంతో ఆ రైతుల ఆశలు ఆవిరయ్యాయి. కళ్లెదుటే పంట కాలి బూడిదవు తుంటే ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఆ అన్నదాతలు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు అందరినీ కలచివేసింది. టేకులపల్లి మండలం బేతంపూడి పంచాయతి వెంకట్యా తండ గ్రామానికి చెందిన సెగ్గెం కుమారస్వామి,సెగ్గెం నాగేశ్వరరావు కౌలు రైతులు ఏడు ఎకరాల పొలంలో మొక్కజొన్న సాగు చేశారు. కోత యంత్రం (మిషన్) కోసం వేచి చూస్తున్న తరుణంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు పంటకు నిప్పు పెట్టారు.అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన తమకు పుట్టెడు దుఃఖం మిగిలిందని రైతులు వాపోయారు. అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా(ఏఐ కె యం ఎస్) జిల్లా నాయకులు భూక్య హర్జ అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) మండల కార్యదర్శి గుగులోతు రామచంద్ డిమాండ్ చేశారు.రైతులతో కలిసి కాలిపోయిన మొక్కజొన్న పంటను పరిశీలించి,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ ఆధారం లేని రైతులు భూమిని కౌలుకు తీసుకొని మొక్కజొన్న వేస్తే ప్రమాదవశాత్తు కాలిందని దానితో పెట్టుబడులు కవులు వారి శ్రమ వృధా అయ్యిందని వారు పుట్టెడు శోకంతో రోదిస్తున్నారని అన్నారు.ప్రజా ప్రభుత్వంలో అధికారులు స్పందించి పంట చేను పరిశీలించి పంటకు నష్టపరిహారం చెల్లించి,కౌలు రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు ఎట్టి నరసింహారావు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి

- జిల్లాలో గర్భిణీ స్త్రీల నమోదు వ్యాధి నిరోధక టీకాలను వంద శాతం లక్ష్యాన్ని సాధించాలి
- డి ఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 4,(ప్రజా జ్యోతి)** వేసవికాలం దృశ్య ప్రతి ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, అదేవిధంగా జిల్లాలో గర్భిణీ స్త్రీల నమోదు వ్యాధి నిరోధిక టీకాలను 100% నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారం రాథోడ్ జిల్లాలోని పలువురు వైద్యులను ఆదేశించారు, సోమవారం ఐ డి ఓ సి జిల్లా కార్యాలయంలో జిల్లాలోని మెడికల్ ఆఫీసర్ల తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో డిఎంహెచ్వో మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా ప్రతి ఆరోగ్య కేంద్రాలలో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, అదేవిధంగా ఆరోగ్య కార్యకర్త,ఆశ ల వద్ద గ్రామపంచాయతీలలో, అంగన్వాడి కేంద్రాలలో, చలివేంద్రాలలో, జనాలు రద్దీగా ఉన్న ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని , వడదెబ్బకు సంబంధించిన వివరాలను కూడా ఎప్పటికప్పుడు నివేదికను జిల్లా కార్యాలయంలో అందించాలని సూచించారు, అదేవిధంగా అసంక్రమిత వ్యాధులు అయిన బీపీ షుగర్ థైరాయిడ్ క్యాన్సర్ గుర్తింపు కొరకు గ్రామాలలో స్క్రీనింగ్ కచ్చితంగా 100% పూర్తి చేయాలని వాటి నివేదికను ఎప్పటికప్పుడు జిల్లాకు సమర్పించవలనని , మలేరియా కేసులు పెరగకుండా ఇప్పటినుంచి జాగ్రత్తలు తీసుకోవాలని, ఫ్రైడే పాటించాలని, ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించడం జరిగినది. .టీబీకేసు లను గ్రామాలలో గుర్తించి వారికి తెమడ పరీక్షలు చేయించి, వారికి చికిత్సను అందజేయాలని సూచించారు,.ఇప్పటివరకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో 98% లక్ష్యాన్ని సాధించినట్లు తెలియజేయగా, మిగిలిన 2% లక్ష్యాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేసి 100% సాధించవలసిందిగా వైద్యాధికారులకు సూచనలు చేశారు, భద్రాచలం డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శ్రీధర్, కొత్తగూడెం డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ సాయి కళ్యాణ్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. ప్రసాద్, డా. ప్రతాప్, డా. హరీష్, డా. రాకేష్, డా. రాందాస్, డా. దినేష్ తదితర వైద్యాధికారులు , ఎన్‌హెచ్ఎం సిబ్బంది పాల్గొన్నారు.



# అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి...)

సిద్ధంగా ఉండాలని, ముఖ్యంగా టార్పాలిన్లు, గిడ్డంగి సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. వర్షం వచ్చే సూచనలు ఉన్నప్పుడు ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి గింజను కొనుగోలు చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని, చిట్టచివరి రైతు వరకూ న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు.రాబోయే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు అకాల వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున అన్ని జిల్లాల్లో ముందస్తు చర్యలు పకడ్బందీగా అమలు చేయాలని, ధాన్యం, మొక్కజొన్న సహా ప్రతి రైతు ఉత్పత్తిని కొనుగోలు చేసి రైతుకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. మే నెల ధాన్యం కొనుగోలుకు అత్యంత కీలకమని, అధికారులందరూ సమన్వయంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం గా పూర్తి చేయాలని అన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాల కలెక్టర్లు ధాన్యం కొనుగోలు ప్రక్రియను బాధ్యతతో,




సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ఈ సీజన్‌లో గత రెండు సీజన్లతో పోలిస్తే అధికంగా ధాన్యం ఉత్పత్తి నమోదైనందున, కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.అకాల వర్షాల నేపథ్యంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని, ప్రతి అంశాన్ని నిరంతరం సమీక్షిస్తూ పరిస్థితిని అదుపులో ఉంచాలని అన్నారు .కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడే చిన్న చిన్న సమస్యలను కూడా వెంటనే గుర్తించి పరిష్కరించేలా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే సంబంధిత ఇంచార్జి మంత్రులకు తెలియజేసి తక్షణ చర్యలు తీసుకు నేలా చూడాలని ఆదేశిం చారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా కొనసాగాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ధాన్యం రవాణాలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే స్పందించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా ముందస్తుగా చెయ్యాలని ఆదేశించారు.మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, టార్పాలిన్ల కొరత లేకుండా చూసుకోవాలని, రైస్ మిల్లర్లతో సమన్వయం పెంచాలని అన్నారు. అవసరమైన గోదాములు లేదా మార్కెట్ యార్డ్ షెడ్యూల్లో ధాన్యం భద్రపరచాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఐడీఓసీ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కొను గోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వరి మొక్కజొన్న కొనుగోళ్లు పూర్తి స్థాయిలో నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 92 కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం చేరుకున్నదని, వెంటనే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు పూర్తైన 24 గంటల్లోపే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసిన రైతులకు వారం రోజుల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు విద్యా చందన, వ్యవసాయ శాఖ అధికారి బాబు రావు, పౌర సరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్నాచౌక్ అభివృద్ధికి శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి...)



లెవల్ చేసే పనులు చేపట్టారు. ఇప్పటి వరకు పిచ్చి చెట్లు, చెత్త, రాళ్లతో నిండిపోయి ప్రమాదకరంగా మారిన ఈ ప్రదేశాన్ని పూర్తిగా శుభ్రం చేశారు. నిరసనలకు వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు లేకపోవడంపై వచ్చిన విమర్శల నేపథ్యంలో అధికారులు త్వరితగతిన స్పందించడం విశేషం. ధర్నాచౌక్ అభివృద్ధి పనులకు నాంది పలుకుతూ భవిష్యత్తులో షెడ్, త్రాగునీటి సదుపాయం, కూర్చునే బల్లలు, విద్యుత్ భద్రత వంటి మౌలిక వసతులు కల్పించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నిరసనలు తెలిపేందుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలతో కూడిన నూతన ధర్నాచౌక్ నిర్మాణం చేపడతామని స్పష్టం చేశారు. స్థానికులు, ప్రజాసంఘాలు ప్రజాజ్యోతి కథనాన్ని ప్రశాంసిస్తూ ధర్నాచౌక్ సమస్యను వెలుగులోకి తీసుకువచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## ప్రజావాణిలో వినతులపై తక్షణ చర్యలు

(మొదటి పేజీ తరువాయి...)



సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించడంతో పాటు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు. ప్రతి ఫిర్యాదులోని మూల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ప్రజావాణిలో వచ్చిన కొన్ని దరఖాస్తులు**

జూలూరుపాడు మండలం సూరారం గ్రామానికి చెందిన భూలక్ష్మి తన రేకుల ఇల్లు శిధిలావస్థలో ఉందని, పలుమార్లు ఇందిరమ్మ గృహం కోసం దరఖాస్తు చేసినప్పటికీ మంజూరు కాలేదని వినతి సమర్పించారు. దీనిపై రెండో విడతలో గృహం మంజూరు అంశాన్ని పరిశీలించాలని గృహ నిర్మాణ శాఖ పీడీకి ఎండార్స్ చేశారు.కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని దుర్గనుబస్తీకి చెందిన నోముల వీరకుమారి తన భర్త గుండె పోటుతో మరణించడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని, జీవనోపాధి కల్పించాలని అభ్యర్థించారు. ఆమె వినతిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఉపాధి కల్పనాధికారికి ఎండార్స్ చేశారు. టేకులపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన భూక్య చంద్రనాయక్ తనకు ఉన్న 18.12 ఎకరాల భూమిలో కొంతభాగాన్ని కుమారులకు బదిలీ చేయడానికి దరఖాస్తు చేసినప్పటికీ కే–ఫామ్ జారీ కాలేదని తెలిపారు. ఈ విషయాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఓఎస్‌డీకి ఎండార్స్ చేశారు. ఇల్లందు మండలం సూదిమల్ల గ్రామపంచాయతీ పరిధిలోని సుభాష్‌నగర్‌కు చెందిన వేమూరు వీరస్వామి తన ఇంటిని తన సోదరుడు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డీపీఓకు ఎండార్స్ చేశారు. టేకులపల్లి మండలం బొమ్మనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లికి చెందిన గోరియా తన 3 ఎకరాలు 20 కుంటల భూమికి పట్టా కోసం పలుమార్లు దరఖాస్తు చేసినప్పటికీ మంజూరు కాలేదని వినతి సమర్పించారు. ఈ అంశంపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని టేకులపల్లి తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు తోడుగా సీఆర్పీఎఫ్

(మొదటి పేజీ తరువాయి...)

మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్/జీడీ నితేష్ కుమార్ (సి/218 బెటాలియన్ కంపెనీ కమాండర్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది పేద నిరుపేద గ్రామస్తులకు చీరలు, లుంగీలు, గమ్చాలు, చెప్పులు, దోమతెరలు, గడ్డపారలు, పారలు, సోలార్ లాంతర్లు, గొడుగులు, నీటి డ్రములు, పళ్ళెాలు, గ్లాసులు, వంట పాత్రలు, గిన్నెలు, డెక్చీలు, పరాత్‌లు పంపిణీ చేశారు.అదేవిధంగా పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, పెన్సిల్ బాక్సులు, రబ్బర్లు అందజేయడంతో పాటు క్రీడా సామగ్రి కింద క్రికెట్ కిట్, వాలీబాల్ సెట్‌లను కూడా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో ఇన్‌స్పెక్టర్ నితేష్ కుమార్ నాయకత్వంలో సి/218 బెటాలియన్ జవాన్లు కీలక పాత్ర పోషించారు. గ్రామస్తులు ఈ కార్యక్రమానికి సంతోషం వ్యక్తం చేస్తూ సి.ఆర్.పి.ఎఫ్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



# భద్రాచలంలో హిజ్రాల వేధింపులు

- షాపుదారులపై దౌర్జన్యం
- పోలీసుల జోక్యం కోరుతున్న ప్రజలు





**భద్రాచలం, మే 4, ప్రజా జ్యోతి:** పట్టణంలో కొందరు హిజ్రాల వేధింపులు రోజురోజుకు పెరుగుతున్నాయని స్థానిక వ్యాపారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని పలు దుకాణాలకు వెళ్లి డబ్బులు ఇవ్వాలని బలవంతపెడుతూ, ఇవ్వకపోతే మహిళలు అని కూడా చూడకుండా అసభ్య పదజాలంతో దూషించడం, బెదిరింపులకు పాల్పడడం వంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి.ప్రత్యేకంగా చిన్న వ్యాపారులు, వీధి దుకాణదారులు ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు హిజ్రాలు గుంపులుగా షాపుల్లోకి ప్రవేశించి డబ్బులు డిమాండ్ చేస్తూ, నిరాకరించినపుడు కస్టమర్ల ముందే దూషించడం వల్ల తమ ప్రతిష్ట దెబ్బతింటోందని వ్యాపారులు వాపోతున్నారు. భయంతో చాలామంది ఇష్టంలేకపోయినా డబ్బులు ఇవ్వాల్సి వస్తోందని తెలిపారు.సోమవారం అంబేద్కర్ సెంటర్ లో ఓ మహిళ షాపు యజమానిని అసభ్యకరంగా దూషిస్తూన్న ఘటనలో పట్టణ ఎస్సైరామకృష్ణ స్వయంగా జోక్యం చేసుకుని వారించినప్పటికీ ఓ హిజ్రా పోలీసుల సూచనలను పట్టించుకోకుండా మళ్లీ షాపుల్లో దౌర్జన్యానికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది . ఈ ఘటనతో స్థానికుల్లో ఆందోళన మరింత పెరిగింది. వ్యాపారులు మాట్లాడుతూ, "మా వ్యాపారం ప్రశాంతంగా సాగేందుకు పోలీసుల నుంచి రక్షణ అవసరం. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.పట్టణ ప్రజలు, వ్యాపార వర్గాలు కలిసి అధికారులను కోరుతూ, వ్యాపార ప్రాంతాల్లో పోలీసు గస్తీ పెంచడం, చేయడం, ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవడం వంటి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కొందరి ప్రవర్తన కారణంగా మొత్తం హిజ్రా సమాజాన్ని చెడ్డపేరు వస్తుందని, చట్టపరమైన చర్యలతో పాటు అవగాహన, పునరావాస కార్యక్రమాలు కూడా చేపట్టాలని అభిప్రాయపడుతున్నారు.ఇకనైనా పోలీసులు స్పందించి ఇటువంటి దౌర్జన్యాలను అరికట్టి పట్టణంలో శాంతి భద్రతలను కాపాడాలని భద్రాచలం ప్రజలు కోరుతున్నారు.

## లాభసాటి పంటలపై దృష్టి సారించండి

- పంట మార్పిడి చేసుకోవడం వల్ల స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చు
- ఐవి. శ్రీనివాస్ రెడ్డి విద్యాన విభాగం ప్రొఫెసర్ &హెడ్
- నందిపాడు గ్రామంలో ఘనంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం






**అశ్వారావుపేట, మే 04, ప్రజాజ్యోతి :** రైతులు లాభసాటి పంటలపై దృష్టి సారించాలని, పంట మార్పిడి విధానాన్ని అనుసరించడం ద్వారా స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని ఐవి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నందిపాడు గ్రామంలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. జె. హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐవి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఒకే పంటను పదే పదే సాగు చేయడం వల్ల నేల సారవంతం తగ్గిపోతుందని, పంట మార్పిడి ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు దిగుబడులు పెరుగుతాయన్నారు.అలాగే, మార్కెట్ లో మంచి డిమాండ్ ఉన్న పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా రైతులు అధిక లాభాలను పొందవచ్చని, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నీటి సంరక్షణ విధానాలు, ఎరువుల సమతుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఇలాంటి కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగకరమని, భవిష్యత్తులో మరిన్ని గ్రామాల్లో నిర్వహిస్తామని తెలిపారు. రైతులు వివిధ సమస్యలపై శాస్త్రవేత్తలను అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కే.దుర్గ, వ్యవసాయ విస్తరణ అధికారి రవీందర్, పంచాయతీ సెక్రటరీ అలివేలు, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ బాబ్జీ, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు, పాల్గొన్నారు.

## కేరళలో కాంగ్రెస్ ( యు డి ఎఫ్) ఘన విజయం వెనుక రేవంత్ రెడ్డి, పొంగులేటి కృషి ఎంతో వుంది

- రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 4,(ప్రజా జ్యోతి)** ఇటీవల కేరళ రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రెవె న్యూ, గృహ నిర్మాణ, సమాచార శా ఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి విస్తృత ఎన్నికల ప్రచారం వల్లనే కాంగ్రెస్ (యు డి ఎఫ్) ఘన విజయం సాధించిందని రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.కేరళలో కాంగ్రెస్ పార్టీ విజయం పట్ల కొత్వాల హర్షం తెలిపారు. ఎన్నికల ప్రచారం నిర్వహించి ఘన విజయంలో పాలుపంచుకున్న సీఎం రేవంత్ రెడ్డి, పొంగులేటి లకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించిన కేర ళ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడు తూ దేశ ప్రజలు కాంగ్రెస్ పార్టీ పట్ల ఆకర్షితులవుతున్నారనటానికి కేరళ విజ యం నిదర్శనమని అన్నారు. ఎవరెన్ని కుయుక్తులు పన్నినా దేశ ప్రజలు కాంగ్రె స్ పార్టీకె మద్దతు తెలుపుతున్నారన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం అనీ, దేశ ప్రధానిగా రాహుల్ గాంధీ ఎన్నిక అవ్వడం ఖాయం అనీ కొత్వాల అన్నారు.

## త్రివేణి విద్యార్థులకు జిల్లా ఎస్పీ అభినందనలు



**లక్ష్మీదేవిపల్లి , మే 4 ( ప్రజాజ్యోతి )** తెలంగాణ పదో తరగతి ఫలితాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో త్రివేణి పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ జిల్లా పోలీస్ కార్యాలయంలో టాపర్లను అభినందించారు. త్రివేణి పాఠశాలకు చెందిన బి. అక్షయ శివాని 592 మార్కులతో జిల్లా ప్రథమ స్థానం సాధించగా పి. అక్షయ్, కె. వర్షితలు 586 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాన్ని ఎస్పీ సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఇతరులకు ఆదర్శమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. త్రివేణి విద్యాసంస్థల విద్యా ప్రమాణాలను ఆయన ప్రశంసించారు.

## సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**కొత్తగూడెం, మే 4 ( ప్రజాజ్యోతి )** నేల పరీక్షల ఆధారంగా శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తేనే రైతులకు అధిక దిగుబడి, ఆదాయం సాధ్యమవుతుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండలంలోని ఎస్సీబీ నగర్ రైతు వేదికలో నిర్వహించిన రైతు మహోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూమి స్వభావాన్ని తెలుసుకుని పంటలు ఎంపిక చేసుకోవాలని అవసరానికి మించి రసాయనాలు వాడకుండా భూమి ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేయాలని సేంద్రియ పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. యువత వ్యవసాయ రంగంపై ఆసక్తి పెంచుకుని దేశ ఆర్థిక వ్యవస్థకు బలం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితా కుమారి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రభుత్వ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



## చికిత్స పొందుతూ తెలుగు యువత మండల అధ్యక్షుడు మృతి



**టేకులపల్లి,మే04, ప్రజాజ్యోతి :** రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న తెలుగు యువత మండలాధ్యక్షుడు సోమవారం మృతి చెందాడు...స్థానికుల కథనం ప్రకారం.. టేకుపల్లి చెందిన రాయల రాజేష్(29) స్థానికంగా హోల్సేల్ దుకాణం నిర్వహిస్తూ, తెలుగుదేశం అనుబంధ తెలుగు యువత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. మే 1న బైక్ లో పెట్రోల్ కొట్టించుకునేందుకు రాజేశ్, అతని షాప్ లో పనిచేసే శ్యామ్ తో కలిసి బంకు కు వెళ్తున్న క్రమంలో ఒక్కసారిగా అకస్మాత్తుగా రోడ్డుపైకి గేదె రావడంతో గేదెను డీ కొని ఇరువురు బైక్ బైక్ మీద నుంచి కింద పడ్డారు. ఈ ఘటనలో రాజేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. శ్యామ్ కు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన రాజేష్ , శ్యామ్ ను 108 లో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. పరిస్థితి విషమించడంతో రాజేష్ సోమవారం ఉదయం మృతి చెందాడు.మృతుడి తండ్రి రాయల నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ అలకుంట రాజేందర్ కేసు నమోదు చేశారు.

## భద్రత ఏర్పాట్లలో అలసత్వం వద్దు

- దొంగతనాలు జరగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోండి
- బంగారు దుకాణాల వ్యాపారులకు ఎస్ఐ యాయతి రాజు సూచనలు



**అశ్వారావుపేట, మే 04, ప్రజాజ్యోతి :** దొంగతనాలు నివారించేందుకు భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని ఎస్ఐ యాయతిరాజు బంగారు దుకాణాల వ్యాపారులకు సూచించారు. సోమవారం తమ కార్యాలయంలో పట్టణంలోని ఆభరణాల దుకాణాల వ్యాపారులకు భద్రతా ప్రమాణాలపై వ్యాపారులతో ఆయన సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని, రాత్రి వేళల్లో తగిన భద్రతా సిబ్బందిని నియమించుకోవాలని, అలాగే అలారం వ్యవస్థలు ఏర్పాటు చేసి, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నగదు, బంగారంలను సురక్షిత లాకర్లలో ఉంచాలన్నారు.ఇటీవల కొన్ని ప్రాంతాల్లో చోటుచేసుకున్న దొంగతనాల ఘటనలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరమని ఎస్ఐ పేర్కొన్నారు. పోలీసుల సూచనలు నిరంతరం పాటిస్తూ అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బంగారు వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు వారోత్సవాలు ప్రారంభం

- నేల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం



**చర్ల, మే 04( ప్రజా జ్యోతి ):**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చర్ల మండలంలోని మూడు రైతు వేదికల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమం మొదటి రోజు నేల ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులకు సాయిల్ హెల్త్ కార్డు యొక్క ప్రాముఖ్యతను వివరించడంతో పాటు, మట్టి నమూనాలు ఎలా తీసుకోవాలి అనే అంశంపై వివరాలు తెలియజేశారు. పైలట్ ప్రాజెక్ట్ కింద మట్టి నమూనాలు ఇచ్చిన రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు.అలాగే సమగ్ర ఎరువుల యాజమాన్యం పై వివరణ ఇవ్వడంతో పాటు నానో ఎరువుల వినియోగం వాటి ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులతో నేల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రతిజ్ఞ చేయించారు.రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఈదయ్య , ఎంఆర్ఓ శ్రీనివాస్ , చర్ల వ్యవసాయ అధికారి లావణ్య ,ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చి బాబు, చర్ల మేజర్ సర్పంచ్ సామ్రాజ్యం, ఏఈఓ ఆఫ్రిది, ఆత్మ డైరెక్టర్లు మడకం పద్మ, పటేల్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతు వారోత్సవం కార్యక్రమం



**చర్ల , మే 4 (ప్రజా జ్యోతి ) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భా గంగా సత్యనారాయణపురం రైతు వేదికలో సోమవారం రై తు వారోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమం ఏఈఓ రామకృష్ణ అధ్యక్షతన ప్రారంభమైంది. ఆర్.కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవికుమార్, కుదునూర్ సర్పంచ్ కుంజా కమల, సత్యనారాయణపురం సర్పంచ్ చిక్కాల గౌతమి, దేవరపల్లి సర్పంచ్ తెల్లం సుజాత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం, నాణ్యమైన విత్తనాల ఎంపిక, పంట రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణ వంటి అంశాలపై శాస్త్రీయ అవగాహన కల్పించారు. అలాగే వివిధ కాలాల్లో ఏ పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి మరియు ఆదా యం పొందవచ్చో వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు.రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్.కొత్తగూడెం ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జునురావు, నల్లపు శేషగిరిరావు, బలిపాటి వర్మరాజు, పెద్దరాజు, శ్యామల కాంతయ్య, కనితి నాగేశ్వరరావు, కారం వెంకటేశ్వర్లు, మీడియం నరసింహారావు, పాయం వెంకటేశ్వర్లు, కారం జనార్ధన్, సోడి వెంకటేశు, పాయం ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముత్తంగి అలంకారంలో భద్రాద్రి రామయ్య

- దర్శించుకున్న భక్తులు



**భద్రాచలం టౌన్, మే 4, ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో సోమవారం స్వామి వారు ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేదాశీర్వచనం నిర్వహించారు.

# దళితులపై వేధింపులు ఆపకపోతే సహించేది లేదు




**ఇల్లందు, మే 4, ప్రజాజ్యోతి:** సమాజంలో దళితులను చిన్నచూపు చూస్తూ వేధింపులకు గురిచేస్తే ఊరుకునేది లేదని, న్యాయ పోరాటం కోసం పోరాడుతామని జాతీయ మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణమూర్తి, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఎడెల్లి గణపతి, జిల్లా ఉపాధ్యక్షులు పల్లంటి రమేష్ లు తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జాతీయ మాల మహానాడు నాయకుడు పొలిమాటి జ్ఞాన సుందర్ ను అదే ప్రాంతంలోని వేరే కులానికి చెందిన ఓ కుటుంబం గత నాలుగు నెలలుగా వేధింపులకు గురి చేయడం ఏమిటని ప్రశ్నించారు. గత మూడు నెలల క్రితం బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడని అనేకమార్లు స్టేషన్ అధికారులు కలిసి తన బాధను వెళ్ళబుచుకున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ బాధితుడిని వేధించే కుటుంబం పట్ల పోలీస్ శాఖ చర్యలు తీసుకోకపోవడంతో మరల వారు పెట్రేగిపోయి వేదనకు పాల్పడ్డారని ఆరోపించారు. దింతో బాధితుడు తమ నాయకత్వానికి అనేక సార్లు ఫిర్యాదు చేయడంతో రాష్ట్ర కమిటీ అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆదేశాలతో బాధితుడిని కలిసి అతని గోడును విని న్యాయం చేయాలని కోరారు. బాధితుడిని తీవ్ర మనోవేదన గురి చేసిన కుటుంబంపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనియెడల న్యాయపోరాటం కోసం ఉన్నత అధికారులు కలిసి వినతి పత్రాలు అందజేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇల్లందు పట్టణ అధ్యక్షులు వేమూరి సాల్మన్ రాజ్, ఇల్లందు మండల అధ్యక్షులు గుర్రం బిక్షపతి, నాయకులు నిట్ట వెంకటేశ్వర్లు, బుయ్యని ప్రభుదాస్, ఎజ్జు దావీదు తదితరులు పాల్గొన్నారు.

## 22వ వార్డులో డ్రైనేజ్ సమస్యకు పరిష్కారం

- -నూతన నిర్మాణ పనులు ప్రారంభం



**ఇల్లందు, మే 4, ప్రజాజ్యోతి:**పట్టణంలోని 22వ వార్డులో కోర్టు ఏరియా మార్గదర్శిని పాఠశాల ఎదురు నుండి మాజీ కౌన్సిలర్ ఆకుల అంజలి ఇంటి వరకు ఉన్న పాత, చిన్న డ్రైనేజీ వల్ల కొన్ని సంవత్సరాలుగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సమస్యను కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యను వెంటనే గుర్తించిన ఆయన ప్రత్యేక నిధుల ద్వారా రూ.2.20 లక్షల వ్యయంతో 130 మీటర్ల పొడవున నూతన డ్రైనేజ్ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్రకు వార్డు సమస్యలను తెలియజేయగానే స్పందించి పనులకు సహకరించినందుకు స్థానిక ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. డ్రైనేజ్ నిర్మాణం పూర్తయిన తర్వాత నీటి నిల్వలు, దుర్వాసన సమస్యలు పూర్తిగా తొలగి ప్రజలకు ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. స్థానికులు ఈ చర్యపై సంతోషం వ్యక్తం చేస్తూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ నవీన్, వర్క్ ఇన్స్పెక్టర్ కృష్ణ, ప్రవీణ్, నరసింహారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు


- స్వామి వారికి తెప్పోత్సవం, దొంగలదోపు, చక్రస్నానం



**భద్రాచలం టౌన్, మే 4, ప్రజాజ్యోతి**: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి పవిత్ర గోదావరి నదిలో తెప్పోత్సవం, చక్రస్నానం నిర్వహించారు. అలాగే ఆలయం వద్ద దొంగలదోపు కార్యక్రమం నిర్వహించారు. మే ఒకటిన స్వామి వారి కల్యాణం జరగ్గా ఆదివారం స్వామి వారికి రథోత్సవం నిర్వహించారు. సోమవారం ఉత్సవాల ముగింపులో భాగంగా చక్రతీర్థం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం ఈవో కె.మోదార్‌రావు, ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబాఉ, వైదిక సిబ్బంది పాల్గొన్నారు.

## ఆస్తమాపై అప్రమత్తతే ఆయుధం

- నేడు ప్రపంచ ఆస్తమా దినోత్సవం







**చర్ల, మే 04 (ప్రజా జ్యోతి ):**ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని ప్రభావితం చేస్తున్న శ్వాసకోశ వ్యాధులలో ఆస్తమా ఒకటి ప్రతి సంవత్సరం మే నెల తొలి మంగళవారం "ప్రపంచ ఆస్తమా దినోత్సవం"గా నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కార్యక్రమాలని నిర్వహిస్తారు. సరైన జాగ్రత్తలు సమయానికి చికిత్సతో ఆస్తమాను పూర్తిగా నియంత్రించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆస్తమా అనేది శ్వాసనాళాలు ఇరుకుగా మారి వాపు రావడం వల్ల కలిగే దీర్ఘకాలిక వ్యాధి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, ఛాతిలో బిగుతు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ధూళి, పొగ, అలర్జీలు, వాతావరణ మార్పులు ప్రధాన కారణాలు.ఆస్తమా రోగుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా చికిత్స, మందుల పంపిణీ,గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహణ,శ్వాసకోశ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలుజాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ప్రత్యేక సేవలు అందుబాటులో తీసుకుని వస్తుంది.ఆస్తమా నియంత్రణలో ప్రభుత్వ ముఖ్య లక్ష్యం ప్రతి రోగికి అందుబాటులో చికిత్స అందించటం,ఆస్తమా వల్ల కలిగే మరణాలను తగ్గించడం,ప్రజల్లో ముందస్తు జాగ్రత్తలపై అవగాహన పెంపొందించడం,కాలుష్య నియంత్రణ ద్వారా వ్యాధి ప్రభావాన్ని తగ్గించడంమే ప్రభుత్వ లక్ష్యం. ఆస్తమా వచ్చిన వారు పండ్లు, పచ్చి కూరగాయలు అధికంగా తీసుకోవాలి అని ,విటమిన్ సి, ఒమేగా–3 ఫ్యాటీ ఆసిడ్స్ ఉన్న ఆహారం ఉపయోగకరం అని తగినంత నీరు తాగాలి అని చల్లని పదార్థాలు, జంక్ ఫుడ్ తగ్గించాలి అని ప్రాసెస్ చేసిన ఆహారం నివారించాలి అని వైద్యులు సూచిస్తున్నారు. ఆస్తమా వ్యాధి పట్ల నిర్లక్ష్యం ప్రమాదకరం అని అవగాహన, జాగ్రత్తలు, సరైన చికిత్సతో ఆస్తమాను నియంత్రించి ఆరోగ్యంగా జీవించవచ్చు అని ప్రతి ఒక్కరూ శ్వాస ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని వైద్యులు సూచిస్తున్నారు.

### ››› ఆస్తమా నివారణకు జాగ్రత్తలు

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం,ధూళి, పొగ, కాలుష్యానికి దూరంగా ఉండటం,అలర్జీ కలిగించే పదార్థాలను నివారించాలి అని ధూమపానం మానుకోవాలి అని ,ప్రతిరోజూ వ్యాయామం యోగా చేయాలి అని వైద్యులు సూచిస్తున్నారు.ఆస్తమా పూర్తిగా నయం కాకపోయినా సరైన వైద్యం ద్వారా నియంత్రణలో ఉంచవచ్చు అని వైద్యుల సూచన మేరకు ఇన్హేలర్లు వాడాలి అని మందులు సమయానికి తీసుకోవాలి అని రెగ్యులర్‌గా చెకప్ చేయించుకోవాలి అని అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి అని తగిన జాగ్రత్తలు పాటిస్తే ఆస్తమాను నియంత్రించి ఆరోగ్యంగా జీవించవచ్చు వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# డాన్స్ పోటీల పాంప్లెట్ల ఆవిష్కరణ






**ఇల్లందు, మే 4, ప్రజాజ్యోతి:** కీర్తిశేషులు బాల, సాయి జ్ఞాపకార్థం వెంకట్ డాన్స్ అకాడమీ (విడిఏ) ఆధ్వర్యంలో విబిసిసి యూత్ సహకారంతో నిర్వహించనున్న రెండు రాష్ట్రాల స్థాయి (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) డాన్స్ పోటీల పాంప్లెట్‌ను సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఇల్లందు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దొడ్డ డానియల్, 13, 3, 10వ వ వార్డు కౌన్సిలర్లు దండు సారయ్య, ఆజ్మీరా వంశీ, మెరుగు కార్తీక్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి డాన్స్ పోటీలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కళలు వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడటమే కాకుండా, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుండి వచ్చే యువతకు తమ ప్రతిభను నిరూపించుకునే మంచి వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుందన్నారు. అలాగే నిర్వాహకులు చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని, భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరు గెలుపోటములను పక్కనపెట్టి తమ ప్రతిభను ప్రదర్శించాలని, క్రీడాస్ఫూర్తితో పాల్గొనాలని సూచించారు. అదే విదంగా ఈ డాన్స్ పోటీలు 2026 జూన్ 14 (ఆదివారం) ఉదయం 9:00 గంటల నుండి, ఇల్లందులోని సీఈఆర్ క్లబ్ వేదికగా జరగనున్నాయన్నారు. వెస్ట్రన్, ఫోక్, క్లాసికల్ (సీనియర్, జూనియర్, సోలో, డ్యూయెట్ కేటగిరీలు) విభాగాలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. వెస్ట్రన్ అండ్ ఫోక్ సీనియర్ గ్రూప్ మొదటి బహుమతి రూ. 25,116, ద్వితీయ బహుమతి రూ. 10,116, తృతీయ బహుమతి రూ. 5,116, వెస్ట్రన్ అండ్ ఫోక్ జూనియర్ గ్రూప్ మొదటి బహుమతి రూ.10,116, ద్వితీయ బహుమతి రూ.5,116, తృతీయ బహుమతి రూ. 3,116, క్లాసికల్ (సీనియర్ అండ్ జూనియర్) మొదటి బహుమతి రూ. 10,116, ద్వితీయ బహుమతి రూ. 5,116, తృతీయ బహుమతి రూ. 3,116, సీనియర్ సోలో (వెస్ట్రన్ అండ్ ఫోక్) మొదటి బహుమతి రూ. 5,116, ద్వితీయ బహుమతి రూ. 3,116, తృతీయ బహుమతి రూ. 2,116, జూనియర్ సోలో (వెస్ట్రన్ అండ్ ఫోక్) మొదటి బహుమతి రూ. 3,116, ద్వితీయ బహుమతి రూ. 2,116, తృతీయ బహుమతి – రూ. 1,116, సీనియర్ సోలో క్లాసికల్ మొదటి బహుమతి రూ. 5,116, ద్వితీయ బహుమతి రూ. 3,116, తృతీయ బహుమతి రూ. 2,116, జూనియర్ సోలో క్లాసికల్ మొదటి బహుమతి రూ. 3,116, ద్వితీయ బహుమతి రూ. 2,116, తృతీయ బహుమతి రూ. 1,116, డ్యూయెట్ (అన్ని విభాగాలు) మొదటి బహుమతి రూ 5,116, ద్వితీయ బహుమతి రూ. 3,116, తృతీయ బహుమతి రూ. 2,116 ఇవ్వనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు, పాల్గొనే కళాకారులందరికీ భోజన సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనేవారు తమ పాటలను పెన్ డ్రైవ్ లేదా మొబైల్‌లో తీసుకురావాలని, క్లాసికల్ డ్యాన్స్ గరిష్ట సమయం 5 నిమిషాలు అని, ఫోక్ అండ్ వెస్ట్రన్ డ్యాన్స్ గరిష్ట సమయం 4 నిమిషాలు అని పేర్కొన్నారు. ప్రతి విభాగంలో కనీసం 10 ఎంట్రీలు ఉంటేనే బహుమతులు ఇవ్వబడతాయని గుర్తుచేశారు. ఈ పోటీలను విజయవంతం చేయడానికి ఇల్లందుతో పాటు రెండు రాష్ట్రాలకు చెందిన కళాకారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాలకు M కడారి వెంకటేష్ – 8374579497, 7989163958, సాయి మాస్టర్ – 9030099139 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహణ



**భద్రాచలం టౌన్, మే 4 ప్రజాజ్యోతి:** భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ట ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. భద్రాచలం డివిజన్ పరిధిలోని ప్రజలు వివిధ సమస్యల కొరకు ప్రజావాణిలో దరఖాస్తులు చేసుకున్నారని, ఇందులో ముఖ్యంగా రెవిన్యూ సమస్యలు, పింఛన్లు, వివిధ సంక్షేమ పథకాలతో పాటు పలు సమస్యలపై ప్రజలు అర్జీలు పెట్టుకున్నారని ఆయన అన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన పలు దరఖాస్తులను పరిశీలించి సంబంధిత డివిజన్ అధికారులకు పంపుతూ, ప్రతి ఫిర్యాదుపై సంబంధిత శాకాధిపతులు వ్యక్తిగత పర్యవేక్షణ చేసి, నిర్ణీత గడువులో పరిష్కారం జరిగేలా చర్యలు చేపట్టాలని, పెండింగ్ లేకుండా చూసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం తాసిల్దార్ దనియాల వెంకటేశ్వర్లు, డీఏవో రాజేంద్రనాథ్, భద్రాచలం డివిజన్ పరిధిలోని వివిధ శాఖల డివిజనల్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో పరారీలో ఉన్న మహారాష్ట్రకు చెందిన నిందితుడి అరెస్ట్



**సుజాత నగర్ ప్రజాజ్యోతి మే 04:** సుజాతనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 498 కేజీల ఎండు గంజాయి అక్టోబర్ నెలలో లారీ కంటైనర్ పట్టుకొని ఇద్దరు నిందితులైన జగదీష్ దయారాం పాటిల్ మరియు లారీ డ్రైవర్ సంజు కుమార్ లను సుజాతనగర్ పోలీసు వారు పట్టుకుని రిమాండ్ కు పంపించడం జరిగింది. ఇట్టి కేసులో పరారీలో ఉన్న గంజాయిని ఒడిస్సా రాష్ట్రంలోని జైపూర్ చెందిన వ్యక్తి వద్ద నుండి కొని లారీ కంటైనర్ లో పెట్టి తరలించన మూడవ ముద్దాయి అయిన మహారాష్ట్ర కు చెందిన అమిత్ రోహిదాస్ పాటిల్ అను వ్యక్తిని సుజాతనగర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రమాదేవి పట్టుకొని, కేసు దర్యాప్తు అధికారి చుంచుపల్లి సీ ఐ ఆర్ వెంకటేశ్వర్లు రిమాండ్ కు తరలించడం జరిగింది. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను కొనడం, అమ్మడం, కలిగి ఉండడం, తాగడం, ట్రాన్స్‌పోర్ట్ చేయడం చట్టరీత్యా నేరం. అట్టి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోబడును.

## కలెక్టర్ ఆదేశాలు వెంటనే వెనక్కి తీసుకోవాలి

- వడ్ల కొనుగోలు నిబంధనలు రైతులపై ఉక్కుపాదం
- ప్రతి గింజను ప్రభుత్వమే కొనాలి సిపిఎం రైతు సంఘం డిమాండ్
- తాలు లేకుండా వడ్లు పండించమంటారా అసాధ్యానికి నిబంధనలు ఎందుకు
- రైతులపై అన్యాయం కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకో ఉద్యమం తప్పదు
- వడ్ల కల్లాలలో ఒక్క గింజ లేకుండా తక్షణమే ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

**సుజాతనగర్, ప్రజాజ్యోతి మే 04:** జిల్లా వ్యాప్తంగా వడ్ల కొనుగోలు ప్రక్రియలో ఏర్పడిన తాజా పరిణామాలు రైతుల్లో తీవ్ర అసంతృప్తి, ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ మండల అగ్రికల్చర్ అధికారులకు జారీ చేసిన కఠిన నాణ్యత ప్రమాణాల ఆదేశాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని రైతు సంఘాలు, సిపిఎం పార్టీ నాయకులు స్పష్టమైన వైఖరితో డిమాండ్ చేస్తున్నారు. రైతుల కష్టానికి విలువ ఇవ్వకుండా, అమలు చేయలేని నిబంధనలు పెట్టి ధాన్యం కొనుగోలు నిరాకరించడం రైతులను నష్టాల్లోకి నెట్టే చర్యగా వారు తీవ్రంగా విమర్శిస్తున్నారు. సుజాతనగర్ మండలంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అధికారుల బృందం, కలెక్టర్ ఆదేశాలను అమలు చేస్తూ నాణ్యత ప్రమాణాలు ఉన్న వడ్లను మాత్రమే కొనుగోలు చేస్తాం అని వెల్లడించడం రైతుల్లో మరింత ఆగ్రహానికి దారి తీసింది. పొలాల్లో పండే ధాన్యంలో కొంతమేర తాలు, చెత్త, మట్టి కలగడం సహజమని, ప్రకృతి పరిస్థితుల్లో పూర్తిగా శుభ్రమైన వడ్లు ఉత్పత్తి చేయడం అసాధ్యమని రైతులు చెబుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో కఠిన ప్రమాణాలు పెట్టి ధాన్యాన్ని తిరస్కరించడం రైతులపై అన్యాయం చేయడమేనని వారు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు, కూలీ ఖర్చులు పెరిగి రైతులు అప్పుల భారంలో కూరుకుపోయిన నేపథ్యంలో, వడ్ల కొనుగోలు ప్రక్రియలో ఇలాంటి నిబంధనలు అమలు చేయడం వారి పరిస్థితిని మరింత దిగజార్చుతుందని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లభించకపోతే రైతులు ఆర్థికంగా పూర్తిగా కుంగిపోతారని, ప్రభుత్వం ఈ విషయాన్ని గంభీరంగా పరిగణించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. సిపిఎం పార్టీ రైతు సంఘం జిల్లా కమిటీ నాయకులు నల్ల గోపు పుల్లయ్య జిల్లా కమిటీ నాయకులు కలెక్టర్ ఆదేశాలపై ఘాటు విమర్శలు గుప్పిస్తూ, రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం అధికారుల ద్వారా కఠిన నిబంధనలు పెట్టి కొర్రీలు పెడుతోందని ఆరోపించారు. గత సంవత్సరంలో కూడా ఇలాంటి విధానాలతో రైతులను ఇబ్బందులకు గురి చేసిన విషయం గుర్తు చేస్తూ, ఈసారి కూడా అదే పద్ధతి కొనసాగించడం పూర్తిగా అన్యాయమని అన్నారు. రైతుల శ్రమను గౌరవించకుండా వ్యవహరించడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తుందని వారు విమర్శించారు. రైతు సంఘాలు, సిపిఎం పార్టీ కలిసి ప్రభుత్వానికి స్పష్టమైన డిమాండ్లు ఉంచాయి. కలెక్టర్ జారీ చేసిన ఆదేశాలను వెంటనే రద్దు చేయాలని, ప్రతి రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధరతో పాటు అదనంగా బోనస్ ప్రకటించాలని వారు కోరుతున్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు ఆలస్యం లేకుండా రైతుల బ్యాంకు ఖాతాల్లో వెంటనే జమ చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో పారదర్శక విధానం అమలు చేయాలని వారు స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను వెంటనే వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని రైతులు హెచ్చరించారు. రాస్తారోకో, ధర్నాలు, నిరసన కార్యక్రమాలతో ప్రభుత్వాన్ని ఎదిరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. రైతు కష్టానికి విలువ ఇవ్వకపోతే మౌనంగా ఉండబోమని, ప్రతి రైతు రోడ్డెక్కే పరిస్థితి వస్తుందని వారు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఇప్పటికే ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. రైతులు గుంపులుగా చేరి అధికారులను ప్రశ్నిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. పండించిన పంటను కొనుగోలు చేయకపోతే బ్యాంకు రుణాలు ఎలా తీర్చాలి, కుటుంబాన్ని ఎలా పోషించాలి అనే ఆవేదన రైతుల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు. రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడం ప్రభుత్వ ధర్మమని, రైతు ఆనందంగా ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని రైతు సంఘం నాయకులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకునే నిర్ణయం రైతుల భవిష్యత్తును నిర్ణయించనుంది. రైతుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకొని తక్షణ చర్యలు తీసుకుంటుందా లేక ఉద్యమాలు ఉధృతమవుతాయా అన్నది ఇప్పుడు జిల్లా ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది.



## హ్యాట్రిక్ విజయం అందించిన జోష్ తెలంగాణలో కమలం వికసించడం ఖాయం

- ఆళ్ళపల్లి మండల అధ్యక్షులు



**ఆళ్ళపల్లి, మే04. ప్రజా జ్యోతి** ఇటీవల మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘనవిజయం సాధించడంపై ఆళ్ళపల్లి మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షులు తాటికొండ శ్రీనివాసచారి మాట్లాడుతూ, ఈ విజయం కేవలం ఆ మూడు రాష్ట్రాలకే పరిమితం కాదని, రాబోయే రోజుల్లో సంచలనం సృష్టించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై, అభివృద్ధిపై ప్రజలకు ఉన్న నమ్మకానికి ఈ విజయాలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. మూడు రాష్ట్రాల్లో విజయం సాధించిన ఉత్సాహంతో, నాలుగో రాష్ట్రంగా తెలంగాణలో కాషాయ జెండా ఎగురవేయడ మే తమ తదుపరి లక్ష్యమని శ్రీనివాసచారి స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాల ను ప్రజల్లోకి తీసుకెళ్లి, బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని ఆయ న కార్యకర్తలకు పిలుపునిచ్చారు. "దేశమంతా మోదీ వైపు చూస్తోంది. మూడు రాష్ట్రాల్లో వచ్చిన ఫలితాలే తెలంగాణలోనూ పునరావృతమవుతాయి. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు, ఆ మార్పు కేవలం బీజేపీతోనే సాధ్యం. ఆళ్ళపల్లి బీజేపీ మండల అధ్యక్షులు.